# 27న సీఎం కేసీఆర్ రాక



సభా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అరూరి రమేశ్, పక్కన మార్నేని రవీందర్‌రావు, వరదారెడ్డి

- భట్టుపల్లిలో వర్ధన్నపేట నియోజకవర్గ ప్రజా ఆశీర్వాద సభకు బీఆర్‌ఎస్ అధినేత..
- ఏర్పాట్లు పరిశీలించిన ఎమ్మెల్యే అరూరి రమేశ్
- పెద్దసంఖ్యలో ప్రజలు తరలిరావాలని ఎమ్మెల్యే పిలుపు
- గులాబీ శ్రేణుల్లో జోష్
- ఊపందుకున్న బీఆర్‌ఎస్ ప్రచారం

వరంగల్, అక్టోబర్ 20(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపు లక్ష్యంగా భారత రాష్ట్ర సమితి ముందుకు సాగుతున్నది. ముందుగానే అభ్యర్థులను ప్రకటించిన బీఆర్‌ఎస్ ప్రచారంలో అన్ని పార్టీల కంటే చాలా ముందున్నది. తొమ్మిదేళ్లలో చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలతో ఆ పార్టీకి ప్రజల్లో ఆదరణ పెరుగుతున్నది. ప్రచారం ప్రక్రియలో భాగంగా బీఆర్‌ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ నెల 27న వర్ధన్నపేట నియోజకవర్గ ప్రజా ఆశీర్వాద సభకు హాజరవుతున్నారు. కాజీపేట–ఉర్సు బైపాస్ రోడ్డులోని భట్టుపల్లిలో ఈ సభ జరుగనున్నది. సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభ కార్యక్రమం శుక్రవారం ఖరారైంది. వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేశ్ ఆధ్వర్యంలో సభ ఏర్పాట్లు మొదలయ్యాయి. నియోజకవర్గ ముఖ్యనేతలతో కలిసి ఎమ్మెల్యే అరూరి భట్టుపల్లిలోని సభ నిర్వహించే స్థలాన్ని పరిశీలించారు. భారీ జన సమీకరణతో బీఆర్‌ఎస్ ప్రచార సభ జరుగనున్నది. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈ నెల 16న జనగామ నియోజకవర్గ ప్రజా ఆశీర్వాద సభలో సీఎం పాల్గొన్నారు. వర్ధన్నపేట ప్రజా ఆశీర్వాద సభ ఉమ్మడి వరంగల్ జిల్లాలో ముఖ్యమంత్రి కేసీఆర్ పాల్గొంటున్న రెండో ఎన్నికల ప్రచార సభ కానున్నది.

### ఫుల్ జోష్..

ఎన్నికల ప్రచారంలో బీఆర్‌ఎస్ ముందున్నది. ప్రత్యర్థి పార్టీలు ఇంకా అభ్యర్థులను సైతం ప్రకటించలేదు. బీఆర్‌ఎస్ అభ్యర్థులు ఇప్పటికే నియోజకవర్గ వ్యాప్తంగా ఒక దశ ప్రచారం పూర్తి చేశారు. బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మరో కీలక మంత్రి తన్నీరు హరీశ్‌రావు ఇప్పటికే ఉమ్మడి వరంగల్‌లోని దాదాపు అన్ని నియోజకవర్గాల్లో ప్రచారం నిర్వహించారు. బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ పార్టీ అభ్యర్థులకు బీ ఫారాలు సైతం అందించారు. అన్ని నియోజకవర్గాల్లోని సభలకు స్వయంగా హాజరయ్యేలా ప్రచార షెడ్యూల్ ఖరారు చేశారు. తొలి దశలో జనగామ, వర్ధన్నపేట నియోజకవర్గాల్లో ప్రచార సభల్లో పాల్గొంటున్నారు. రెండోదశలో మిగిలిన నియోజకవర్గాల్లో ప్రచారం చేసేలా త్వరలోనే షెడ్యూల్ రూపొందించనున్నారు.

### భారీగా తరలిరావాలి..

**- ఎమ్మెల్యే అరూరి రమేశ్**

సీఎం కేసీఆర్ ఈ నెల 27న మధ్యాహ్నం 2 గంటలకు వర్ధన్నపేట నియోజకవర్గ ప్రజా ఆశీర్వాద సభకు వస్తున్నారని ఎమ్మెల్యే అరూరి రమేశ్ తెలిపారు. గ్రేటర్ వరంగల్ 44వ డివిజన్ పరిధి భట్టుపల్లిలోని ఎస్సార్ కాలేజీ పక్కనున్న స్థలంలో సభ నిర్వహించనున్నట్లు చెప్పారు. సభ నిర్వహణకు అవసరమైన అనుమతులు, ఏర్పాట్లను పూర్తి చేస్తున్నామని తెలిపారు. సభలో వర్ధన్నపేట నియోజకవర్గ అభివృద్ధి, బీఆర్‌ఎస్ పార్టీ మ్యానిఫెస్టోపై ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజలకు వివరించనున్నారని చెప్పారు. నియోజకవర్గ ప్రజలు, ఉద్యమకారులు, మహిళలు, యువకులు భారీగా తరలివచ్చి సభను విజయవంతం చేయాలని కోరారు. డీసీసీబి చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, ఎస్సార్ విద్యా సంస్థల అధినేత వరదారెడ్డి, కార్పొరేటర్ ఇండ్ల నాగేశ్వర్‌రావు, పీఏసీఎస్ చైర్మన్లు ఊకంటి వనం రెడ్డి, మోతపోతుల మనోజ్‌గౌడ్, జిల్లా నాయకులు పోలెపల్లి రామ్మూర్తి, బుద్దె వెంకన్న, పట్టపురం ఏకాంతం పాల్గొన్నారు.



కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న సీపీ అంబర్ కిశోర్ ఝా, పోలీసు అధికారులు, పోలీసు అమవీరుల కుటుంబ సభ్యులు

## పోలీసు అమరవీరుల త్యాగాలు స్మరించుకుందాం

- పోలీసు కమిషనర్ అంబర్ కిశోర్ ఝా
- అశోకా జంక్షన్ నుంచి కమిషనరేట్ వరకు కొవ్వొత్తులతో ర్యాలీ
- నేటి నుంచి 31 వరకు సంస్మరణ దినోత్సవ కార్యక్రమాలు

సుబేదారి, అక్టోబర్ 20 : శాంతి భద్రతల పరిరక్షణ కోసం ప్రాణత్యాగం చేసిన పోలీసు అమరవీరులను స్మరించుకుందామని వరంగల్ సీపీ అంబర్ కిశోర్ ఝా పిలుపునిచ్చారు. శుక్రవారం సాయంత్రం హనుమకొండ అశోకా జంక్షన్ నుంచి కమిషనరేట్ వరకు పోలీసు అమరవీరుల కుటుంబ సభ్యులతో కలిసి కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలీసు అమరవీరులను స్మరిస్తూ శనివారం కమిషనరేట్‌లో నివాళి, పరేడ్ కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. ఈ నెల 21 నుంచి 31వ తేదీ వరకు సంస్మరణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. 21న హనుమకొండ, కాజీపేట డివిజన్ల పరిధిలో రక్తదాన శిబిరాలు, 27న కమిషనరేట్, 28న జనగామ, 29న స్టేషన్ ఘన్‌పూర్, వర్ధన్నపేట, 30న పరకాల, నర్సంపేట డివిజన్లలో రక్తదాన శిబిరాలు నిర్వహిస్తామని చెప్పారు. ఎనిమిదో తరగతి నుంచి ఇంటర్ విద్యార్థులకు 'సమర్థవంతమైన పోలీసింగ్ కోసం సాంకేతికత ఉపయోగం' డిగ్రీ విద్యార్థులకు 'సోషల్‌మీడియా దుర్వినియోగం ఆరికట్టడంలో పోలీసుల పాత్ర' అనే అంశంపై https://forus.gle/b7bejvalokj29Vuz6 ఆన్‌లైన్ లింకు ద్వారా తెలుగు, ఇంగ్లిష్, ఉర్దూ భాషల్లో వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. పోలీసులు వినియోగించే ఆయుధాలపై విద్యార్థులకు అవగాహన కల్పించడం, ఆన్‌లైన్‌లో ఓపెన్ హౌజ్‌లను ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీసీపీలు మురళీధర్, రవీందర్, సురేశ్ కుమార్, బారి,

## రైలు ఢీకొని వృద్ధురాలి మృతి

కాజీపేట, అక్టోబర్ 20 : కాజీపేట–హసన్‌పర్తి రోడ్డు రైల్వే స్టేషన్ల మధ్య ఓ వృద్ధురాలు రైలు ఢీకొని మృతి చెందిన ఘటన శుక్రవారం జరిగింది. కాజీపేట జీఆర్పీ ఎస్సై ఐలయ్య తెలిపిన వివరాల ప్రకారం.. కోమటిపల్లి రైల్వేగేట్ సమీపంలో వృద్ధురాలు పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందింది. ఎరుపురంగు చీర, ఆకుపచ్చ రంగు జాకెట్ ధరించి ఉన్నట్లు తెలిపారు. పంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం వరంగల్ ఎంజీఎం దవాఖానకు తరలించి మార్చురీలో భద్రపరిచామన్నారు. బంధువులు, సంబంధీకులుంటే కాజీపేట జీఆర్పీ స్టేషన్ లేదా 99594 25483 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

## మైలారం రిజర్వాయర్‌లో మృతదేహం

రాయపర్తి, అక్టోబర్ 20 : మండలంలోని మైలారం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లో కొండూరు గ్రామ శివారు భోజ్యాతండా సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం నీటిపై తేలియాడుతున్నట్లు స్థానికులు తెలిపారు. వ్యక్తి మృతదేహం తండా శివారులో నీటి అలల తాకిడికి ఒడ్డుకు కొట్టుకు వస్తున్నట్లు చెప్పారు.

## బోగస్ ఫైళ్ల కుంభకోణంలో మరొకరి అరెస్టు

**అప్పటి అకౌంటెంట్ ఉమాకాంత్ రిమాండ్**

వరంగల్, అక్టోబర్ 20 : ఫోర్జరీ సంతకాలతో బోగస్ ఫైళ్లు సృష్టించి రూ. 2.31 కోట్లు కాజేసిన కేసులో మరో వికెట్ పడింది. ప్రధాన సూత్రధారి బండా అన్వేష్ ఇప్పటికే ఖమ్మం జైలులో ఉన్నాడు. మట్టెవాడ పోలీసులు కుంభకోణం జరిగిన సమయంలో జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్‌గా విధులు నిర్వర్తించిన ఉమాకాంత్‌ను అరెస్టు చేసి విచారించగా, అన్వేష్‌కు సహకరించినట్లు అంగీకరించాడు. కాగా, కుంభకోణంలో ఉమాకాంత్ పాత్ర ఉందని 'నమస్తే తెలంగాణ' ముందుగానే కథనం ప్రచురించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఉమాకాంత్‌ను విచారించిన పోలీసులు శుక్రవారం అతడిని కోర్టులో హాజరుపరిచారు. కోర్టు అతడికి రిమాండ్ విధించింది. దీంతో ఉమాకాంత్‌ను పరకాల సబ్ జైల్‌కు తరలించారు.

## అంపశయ్య నవీన్‌కు విద్వాన్ విశ్వం స్మారక పురస్కారం

పోచమ్మమైదాన్, అక్టోబర్ 20 : ప్రముఖ రచయిత, కేంద్ర సాహిత్య అవార్డు గ్రహీత అంపశయ్య నవీన్‌కు విద్వాన్ విశ్వం స్మారక పురస్కారాన్ని ప్రకటించారు. చెన్నై నగరానికి చెందిన నవ సాహితీ ఇంటర్నేషనల్ సంస్థ నిర్వాహకులు వర్చువల్‌గా శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ప్రదానం చేశారు. నవ సాహితీ సంస్థ వ్యవస్థాపకుడు సూర్యప్రకాశ్ మాట్లాడుతూ.. అంపశయ్య నవీన్ నవలలు అందరిని ఆకర్షించేవిగా ఉంటాయని, ఆయన రాసిన నవలలపై త్వరలో వరంగల్‌లో వర్క్‌షాపు నిర్వహిస్తామని చెప్పారు. నవీన్ రచించిన 'స్నేహరాగం' పుస్తకానికి ఈ పురస్కారాన్ని అందజేశామని తెలిపారు. చెన్నై విశ్వవిద్యాలయ తెలుగు ప్రొఫెసర్ సంపత్‌కుమార్ పాల్గొన్నారు.

# మావోయిస్టు మిలీషియా సభ్యుల అరెస్టు




వివరాలు వెల్లడిస్తున్న సీఐ బండారి కుమార్

వెంకటాపురం(నూగూరు), అక్టోబర్ 20 : మండలంలో ఆరుగురు మావోయిస్టు మిలీషియా సభ్యులను పోలీసులు అరెస్టు చేశారు. శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో సీఐ బండారి కుమార్ మాట్లాడుతూ.. విశ్వసనీయ సమాచారం మేరకు గురువారం సాయంత్రం మండలంలో ఎస్సై అశోక్ వాహన తనిఖీలు నిర్వహించారు. ఆరుగురు వ్యక్తులు చేతిలో సంచులతో నడుచుకుంటూ వస్తు పోలీసులను చూసి పారిపోతుండగా వెంబడించి పట్టుకున్నారు. నిందితులు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం, ఊసూరు బ్లాక్, పూజారి కాంకెడ్, బీజాపూర్ జిల్లాకు చెందిన తాటి అర్జున్, సోడి వీరయ్య, సోడి గోపి, సోడి రామయ్య, తాటి రమేశ్, సోడి నగేశ్‌గా గుర్తించారు. వీరి వద్ద జిలిటెన్ స్టిక్స్ 12, డిటోనేటర్లు 2, బ్యాటరీలు 4, ఎలక్ట్రిల్ వైర్ 60 మీటర్లు, 2 బాక్స్‌లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీరు కొంత కాలంగా మావోయిస్టు పార్టీ మిలీషియా సభ్యులుగా పనిచేస్తున్నట్లు చెప్పారు. మావోయిస్టు అగ్ర నాయకులు, దళ సభ్యుల ఆదేశాల మేరకు ఎన్నికలను బహిష్కరించాలని ముద్రించిన కరపత్రాలను కొత్తపల్లి క్రాస్ రోడ్డు వద్దకు తీసుకెళ్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై కొప్పుల తిరుపతి రావు పాల్గొన్నారు.

## ఊరిలో గ్రంథాలయం నిర్మించడం నా కల

- ఆస్కార్ అవార్డు గ్రహీత, సినీ గేయ రచయిత చంద్రబోస్
- స్వగ్రామం చల్లగరిగలో నూతన గ్రంథాలయ భవనానికి భూమి పూజ

చిట్యాల, అక్టోబర్ 10 : ఆస్కార్ అవార్డు రావడంతోనే తమ ఊరిలో నూతన గ్రంథాలయ భవన నిర్మాణం చేపట్టాలని భావించానని ప్రముఖ సినీ గేయ రచయిత కనుకుంట్ల చంద్రబోస్ అన్నారు. మండలంలోని ఆయన స్వగ్రామం చల్లగరిగెలోని శివాలయం పక్కన గల గ్రంథాలయ పాత భవనం స్థలంలో శుక్రవారం నూతన భవన నిర్మాణానికి చంద్రబోస్ తన సతీమణి సుచిత్రతో కలిసి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాను ఈ స్థాయికి ఎదగడానికి కారణం గ్రామంలోని గ్రంథలయమేనని చెప్పారు. చదువుకునే రోజుల్లో శివాలయంలో జరిగే భజన పాటలు వింటూ, గ్రంథాలయంలో ఉన్న పుస్తకాలను చదవడం వల్లే తనకు పాటలు రాయడం అలవాటుగా మారిందని, సినీ పరిశ్రమలో అవకాశం లభించందని పేర్కొన్నారు. అందుకే పుట్టిన ఊరిలో సొంత నిధులతో గ్రంథాలయ భవనం నిర్మించాలని నిర్ణయించానని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ దావు వినోదావీరారెడ్డి, బండి రాజమౌళి, ఎండీ జిలాని, సుంకరి మహేశ్, కనుకుంట్ల ప్రభాకర్, పాలకుర్తి ఐలయ్య, ఆకుల సుధాకర్, కర్రె సతీశ్‌రెడ్డి, ఏరుకొండ తిరుపతి, బిల్ల భిక్షపతి పాల్గొన్నారు.



గ్రంథాలయ నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న చంద్రబోస్ ఆయన భార్య సుచిత్ర